క్లుప్తంగా

టోల్ ఫ్రీ సద్వినియోగం చేసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ఎటువంటి ఇబ్బంది కలిగినా టోల్ ఫ్రీ నంబర్ 18005719984ను సంప్రదించాలని శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ సూచించారు. ఆదివారం మండలంలోని గడ్డపోతారంలో ఆయన మాట్లాడుతూ శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌ను శబరిమలకు వచ్చే భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగినా, అయ్యప్ప దేవాలయ సమాచారం, పూజా కార్యక్రమాల సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ శ్రేణులు



మన్‌కీబాత్ ఎపిసోడ్‌ను వీక్షిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: మన్ కీ బాత్ 105వ ఎపిసోడ్‌ను మెదక్ పార్లమెంట్ విస్తారక్ రిషీ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ ఆదివారం చిట్కూల్ గ్రామ పరిధి వడ్డెర కాలనీలో 117 బూత్ అధ్యక్షుడు దస్తగిరి నివాసంలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుకర్ రెడ్డి, పటాన్‌చెరు మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాచమల్ల నరేందర్ గౌడ్, పటాన్‌చెరు మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్ గౌడ్, మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు క్రాంతి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ర్యాలీ



ప్లకార్డులతో దళిత సంఘాల నాయకులు, మహిళలు

జిన్నారం(పటాన్‌చెరు): చిట్కూల్ సర్పంచ్ నీలం మధుకు మద్దతుగా దళిత సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని రాళ్లకత్వలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నీలం మధుకు అనుకూలంగా నినాదాలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను ఆయనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నీలం మధుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్, మురళీకృష్ణ, రమేష్, గణేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహానికి వినతి పత్రం



వినతి పత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

సదాశివపేట(సంగారెడ్డి): అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి పట్టణంలోని వినాయక విగ్రహానికి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దానధర్మాలపై అవగాహన కల్పించాలి

పటాన్‌చెరు: విద్యార్థి దశలోనే దానధర్మాలపై అవగాహన కల్పించాల్సిన అవశ్యకత ఉందని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి అన్నారు. బీరంగూడలోని ఆ పాఠశాల ఆధ్వర్యంలో సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్ అనే చారిటబుల్ పాప్-అప్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ స్టోర్‌లో విద్యార్థులు తమ బంధువులు, తెలిసినవారు వినియోగించని వస్తువులను సేకరించిన ఉంచారు. నిరుపేదలు తమకు కావల్సిన వస్తువులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగల వ్యక్తులుగా ఎదగడానికి తాము నిర్వహించిన కార్యక్రమం సహాయ పడుతుందన్నారు. స్ట్రీట్ స్టోర్ పాఠశాల కార్యక్రమం నేను, నా దేశం, మేము కలిసి పెరుగుతాం అనే నినాదంతో ప్రారంభించినట్లు తెలిపారు.

వీధులన్నీ కంపు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- జ్వరం, డెంగీ, మలేరియాతో ప్రజలు సతమతం
- ఇటీవల చికిత్స పొందిన వెయ్యి మంది జ్వరపీడితులు
- చర్యలు చేపట్టాలని డిమాండ్



బొల్లారంలోని పాత బస్తీలో ఓ కాలనీ దుస్థితి

వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడంలేదు. అపరిశుభ్రత కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. డెంగీ, మలేరియా లాంటి వాటిన బారినపడుతున్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, రోగాల నివారణకు అధికారులు, వైద్యులు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

– జిన్నారం(పటాన్‌చెరు)

జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 22 వార్డులున్నాయి. సుమారు 50 వేల జనాభా ఉంది. మున్సిపాలిటీకి ఏటా రూ.12 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్నారు. బొల్లారం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండగా పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ఈ ప్రాంతంలో సుమారు వంద భారీ, మధ్యతరహా, చిన్న పరిశ్రమలుంటాయి. ఈ ప్రాంతంలో 40 వరకు ప్రైవేటు ఆస్పత్రులు, ఒక ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. అందులో నిత్యం 400ల మందికి, ఒక్కో ప్రైవేటు ఆస్పత్రిలో వెయ్యి మందికి రోగులకు వైద్యం చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా దోమల బెడద పెరిగింది. దీంతో వెయ్యి మంది జ్వరంతో బాధపడుతున్నారు. గడిచిన రెండు నెలల్లో పది మంది డెంగీ, మరో 200ల మంది టైఫాయిడ్, మలేరియా బారినపడ్డారు. జ్వరపీడితులే ఆస్పత్రికి ఎక్కువగా వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

అపరిశుభ్రంగా కాలనీలు

బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలు అధ్వానంగా మారాయి. రోడ్లపైనే మురుగు పారుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో రాజీ పడటం లేదు. దోమల పెరుగుదలను నివారించేలా ప్రాథమిక దశ నుంచే చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఫాగింగ్ కోసం ప్రత్యేక యంత్రాలను కొనుగోలు చేశాం. దోమలను నివారణకు ప్రజలు కూడా వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

మెరుగైన సేవలు అందిస్తున్నాం

జ్వరాల బారినపడి ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, దోమకాటుతో వచ్చే వ్యాధులు ఇతర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా కాలనీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– రాధిక, వైద్యాధికారి బొల్లారం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): పరిసరాలను ప్రతీ ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల పూరీ జగన్నాథ స్వామి దేవాలయం ఆవరణలో ఇండియన్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో) శ్రీధర్, కౌన్సిలర్‌లు శైలజ, సుజాత పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రోజారాణి

కాసం ఫ్యాషన్ రెడీమేడ్ షోరుం ప్రారంభం

హాజరైన సినీనటి అనసూయ భరద్వాజ్

సదాశివపేట(సంగారెడ్డి): రెడీమేడ్ వస్త్ర ప్రపంచంలో కాసం ఫ్యాషన్స్ నూతన ఒరవడి సృష్టించిందని సినీనటి, ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్ అన్నారు. ఆదివారం కాసం ఫ్యాషన్స్ రెడీమెడ్ షోరుమ్‌ను అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షోరూంలో అన్ని వర్గాల వారి అభిరుచి తగ్గ రెడీమేడ్ దుస్తులు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. అనంతరం షోరూం డైరెక్టర్లు కాసం మల్లికార్జున్, నమశ్శివాయ, కేదారినాథ్, శివప్రసాద్ మాట్లాడారు. సదాశివపేటలో కాసం 7వ షోరుమ్ ప్రారంభించామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో హన్మకొండ, పరకాల, షాద్‌నగర్, జమ్మికుంట, భద్రాచలం, వికారాబాద్ పట్టణాల్లో ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం కాసం, ఫణిత, సాయి కృష్ణ, పుల్లూరు అరుణ్, విశాల్, యాంసాని సుమాన్ తదితరులు పాల్గొన్నారు.



కాసం రెడీమెడ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీతార అనసూయ భరద్వాజ్, పక్కన రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ తదితరులు

విశేష అలంకరణలో వినాయకుడు

పటాన్‌చెరు టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మండల పరిధిలోని రుద్రారం గణేశ్ గడ్డ దేవస్థానంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి అభిషేకం, భక్తులు హోమం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామి వారిని నాణేలతో అలంకరించారు. నిత్యాన్నదాన కార్యక్రమం సాగుతోందని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు.

గణనాథుని సన్నిధిలో..

మండలం పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని గణేశ్ గడ్డ దేవాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా ఆదివారం విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గణనాథుని సన్నిధిలో పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంత రావు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు

కంది(సంగారెడ్డి): కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన కందిలోని 615 సర్వే నంబర్‌లోగల ప్రభుత్వ భూమిలోవేసిన గుడిసెలను పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ నివసించడానికి ఇళ్లు లేక పేదలు ఇబ్బందులుపడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేస్తున్నా అధికారులు అడ్డుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, ఆనంద్, సువర్ణ, సుజాత, నసీమా, శివాజీ నాయక్, సాబీర్, పాష, విక్రం పాల్గొన్నారు



మహిళలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తానని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హట్కర్‌పేట భవాని మందిరంలో బవసార్ క్షత్రియ సమాజం, తిలక్‌రోడ్డులోగల చేనేత సహకార సంఘం సభ్యులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి చింతా ప్రభాకర్‌కు మద్దతు ప్రకటించారు. భవాని మందిరంలో నిర్వహించిన సమావేశంలో చింతా ప్రభాకర్ మాట్లాడుతూ భవానీ మందిరం అభివృద్ధికి రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కోఆప్షన్ మెంబర్ ఖలీమ్, బవసార్ క్షత్రియ సమాజం పట్టణ అధ్యక్షులు వాదోని చంద్రశేఖర్, సభ్యులు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చింతా ప్రభాకర్‌కు మద్దతు తెలుపుతున్న బవసార్ క్షత్రియ సమాజం సభ్యులు

లంబోదరుడికి పూజలు.. లడ్డూల వేలం

గణేశ్ నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువైన గణనాథుడికి ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు పూజలు చేశారు. వినాయకుడికి సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. జిన్నారంలోని ప్రకృతి నివాస్ మండప నిర్వాహకులు లడ్డూను వేలం వేయగా రూ.2 లక్షలకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. అలాగే సిర్గాపూర్‌లో వినాయక మండపం వద్ద ముస్లిం యువకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేశ్ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించాలని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ సూచించారు.



పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో వినాయకుడికి పూజచేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం: ప్రకృతి నివాస్‌లో రూ.2 లక్షలకు దక్కించుకున్న లడ్డూతో భక్తుడు



సదాశివపేటలో వినాయకుడికి పూజ చేసిన నాయకులు



జహీరాబాద్ టౌన్: వినాయడి పూజలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



పటాన్‌చెరు: మోదీ కాలనీలో గణేష్ లడ్డూ ప్రసాదంతో మహిళలు



కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో అన్నదానం చేస్తున్న ముస్లిం యువకులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్‌నగర్‌లో జరిగిన పూజలో పాల్గొన్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ నగర సంకీర్తన



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హరినామస్మరణ చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. హరినామ స్మరణతో ఆత్మశుద్ధి, ప్రశాంతత కలుగుతుందన్నారు. నగర సంకీర్తనలో మహిళలు పిల్లలు, పట్టణ ప్రముఖులు, వైద్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

◆ మహిళలు రాజకీయంగా రాణించేందుకే..

మునిపల్లి(అందోల్): మహిళలు రాజకీయంగా రాణించేందుకు లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టడం జరిగిందని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ శనివారం అన్నారు. చట్టసభల్లో మహిళలకు చోటు కల్పించడం హర్షనీయమన్నారు. అలాగే బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ అమలుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపారు.



◆ ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో నూతనంగా పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మిస్తున్నారు. నిర్మాణానికి జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ ముందుకు వచ్చారు. ఆదివారం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు.

◆ అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు



నారాయణఖేడ్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్ఆర్‌వి బోడ రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఆపార్టీ ఖేడ్ నియోజకవర్గ నాయకులు ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇకపై ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయకుండా గుణపాఠం చెప్పేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

◆ నేడు కుల సంఘాల భవనాలు ప్రారంభోత్సవం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలో నూతనంగా నిర్మించిన కుల సంఘాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని సర్పంచ్ నర్సింహారెడ్డి ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో విశ్వకర్మ, బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, రజక, మాల, మన్నుగూడెం యాదవ సంఘాల భవనాలు నిర్మించామన్నారు. వీటిని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

◆ బీఆర్ఎస్ లో చేరిక

పటాన్‌చెరు: మండలంలోని రుద్రారం యువత ఎమ్మెల్యేకు జై కొట్టారు. గ్రామంలోని శివాజీ యూత్ కు చెందిన 50 మంది యువకులు ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువకులందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి,



ఎంపీటీసీ రాజు, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

మునిపల్లి(అందోల్): బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆదివారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ అన్నారు. పార్టీ మండల మైనార్టీ సెల్ ఉపాధక్షుడిగా మండలంలోని మగ్దుంపల్లికి చెందిన ఇంతియాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జెడ్పీటీసీ కార్యాలయంలో నియామక పత్రాన్ని సాయికుమార్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొత్త పైపుల ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో దెబ్బతిన్న మురుగు కాల్వ పైపులను తొలగించి ఆదివారం కొత్తవి వేశారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైపులు పగిలి మురుగు రోడ్డుపై పారుతోంది. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో మాజీ కౌన్సిలర్ రాములు నేత చొరవతీసుకుని దెబ్బతిన్న పైపులను తీయించి వాటి స్థానంలో కొత్తవి వేయించారు.

◆ ఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్‌నగర్ కాలనీ, పటేల్ కాలనీ, శివాజీచౌక్ తదితర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శివాజీచౌక్ సమీపంలో పారతో గడ్డిని తొలగించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు, శానిటరీ అధికారి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు నగేష్, గౌస్‌చిస్తి పాల్గొన్నారు.